క్లుప్తంగా

ప్రైవేటు పాఠశాలల నిలువు దోపిడీ

వరదయ్యపాళెం: ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు ప్రభుత్వ నిబంధనలు పాటించడం లేదు. విద్యార్థులకు తాగునీరు, మరుగుదొడ్లు, క్రీడా ప్రాంగణం తదితర కనీస వసతులు కల్పించడం లేదు. విద్యార్థుల నుంచి ఫీజులుఇష్టారాజ్యంగా వసూలు చేస్తున్నారు. పుస్తకాలు, యూనిఫాం, స్టేషనరీని అధిక ధరలకు విక్రయిస్తూ విద్యార్థులను దోచుకుంటున్నారు. సత్యవేడు నియోజకవర్గంలో మొత్తం 26 ప్రైవేటు పాఠశాలలు, మరో 18 ఇంటర్, డిగ్రీ కళాశాలలు ఉన్నాయి. ఈ ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థులకు కనీస సౌకర్యాలు కరువయ్యాయి. విద్యార్థుల నుంచి ఫీజుల వసూళ్లలో చూపుతున్న శ్రద్ధను యాజమాన్యాలు మౌలిక వసతుల కల్పనలో చూపడం లేదు. అన్ని ప్రైవేటు పాఠశాలల్లో క్వాలిఫైడ్ టీచర్లు లేరు. దీనిపై వరదయ్యపాళెం ఎంఈఓ సరస్వతి మాట్లాడుతూ ప్రైవేటు పాఠశాలల్లో ఫీజుల వివరాలను తమకు పంపాలని ఆదేశించామన్నారు. పాఠశాలలను తనిఖీ చేస్తున్నామని, నిబంధనలు పాటించకుంటే చర్యలు తీసుకుంటామన్నారు.

మూతపడిన ఎస్‌బీఐ ఏటీఎం



బుచ్చినాయుడుకండ్రిగ: స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా ఏటీఎం గత వారం రోజులుగా మూతపడడంతో ఖాతాదారులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. మండలంలో బుచ్చినాయుడుకండ్రిగలో ఒక ఎస్‌బీఐ ఏటీఎం మాత్రమే ఉంది. ఈ ఏటీఎం మరమ్మతుల కారణంతో సిబ్బంది మూత వేశారు. దీంతో ఖాతాదారులు డబ్బు లు కోసం నానా అవస్థలు పడుతున్నారు. బ్యాంకు సెలవు దినాల్లో ఖాతాదారులు బాధ లు వర్ణనాతీతం. ఏటీఎంను వాడుకుంటున్నారని ఎస్‌బీఐ బ్యాంకు వారు సంవత్సరానికి రూ.150 చార్జీ వసూలు చేస్తూ, వారం రోజులుగా ఏటీఎం మరమ్మతులకు గురైందని మూత వేయడం దారుణమని ఖాతాదారులు వాపోతున్నారు. డబ్బుల కోసం బ్యాంకులో గంటలు తరబడి బారులు తీస్తున్నారు. ఇప్పటికైన సంబంధిత శాఖ ఉన్నతాధికారులు స్పందించి ఏటీఎం పనిచేసేలా చర్యలు తీసుకోవాలని ఖాతాదారులు కోరుతున్నారు.

వేద నారాయణ స్వామి ఆలయంలో అన్నదానం



అన్నదానం చేస్తున్న ఉభయదారులు

నాగలాపురం: టీటీడీ అనుబంధంగా ఉన్న మత్స్యావతార క్షేత్రమైన శ్రీవేదవల్లి సమేత శ్రీవేదనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం అన్నదాన సేవా కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి హైదరాబాద్‌కు చెందిన కె.లావణ్య, ఆమె కుటుంబ సభ్యులు ఉభయదారులుగా వ్యవహరించారు. అనంతరం ధర్మరక్షణ సమితి బాల సంస్కార కేంద్రంలోని చిన్నారులకు ఆలయ ఇన్‌స్పెక్టర్ చెంగల్రాయులు భగవద్గీత సారాంశాన్ని పిల్లలకు వివరించారు. చిన్నారులకు నోటుపుస్తకాలు, పెన్నులు, పలకలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ షరాబు ఉదయ్ కుమార్, ధర్మరక్షణ సమితి కోశాధికారి రఘు, సమితి సభ్యులు పాల్గొన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల వేదిక



ఎంపీడీఓ పీఎంకే బాబు

నాగలాపురం: తిరుపతి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు 24వ తేదీ సోమవారం ఉదయం 9.30 గంటలకు మండల పరిషత్ కార్యాలయం వద్ద నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ వేదికలో అధికారులు పాల్గొనాలని ఎంపీడీఓ పీఎంకే బాబు కోరారు. అదేవిధంగా ప్రతి పంచాయతీ కార్యాలయంలో ఉదయం 10 గంటలకు 'మీకోసం' కార్యక్రమాన్ని కార్యదర్శులు నిర్వహించాలన్నారు. ప్రజల వద్ద నుండి వచ్చే ఫిర్యాదులను స్వీకరించి అప్పటికప్పుడే పరిష్కరించాలన్నారు.

శ్రేష్ట నెట్స్ ఫలితాల్లో సాయితేజ ప్రతిభ



సాయితేజ

బుచ్చినాయుడుకండ్రిగ: పుత్తేరి గ్రామానికి చెందిన పెరిమిడి రఘు కుమారుడు సాయితేజ శ్రేష్ట నెట్స్ ఎగ్జామ్ ఫలితాల్లో ఆలిండియా 1583 ర్యాంకు సాధించారు. దీంతో సాయితేజను గ్రామస్తులు అభినందించారు.

సంపద తయారీ కేంద్రాలకు గ్రహణం

- గ్రామాల్లో లోపించిన చెత్త సేకరణ
- నిరుపయోగంగా డంపింగ్ యార్డ్‌లు
- వృథా అవుతున్న రూ.కోట్ల ప్రజాధనం



ఏర్పేడు మండలం పంగూరు వద్ద డంపింగ్ యార్డు దుస్థితి

శ్రీకాళహస్తి రూరల్: లక్షలు ఖర్చు పెట్టి ప్రతి గ్రామంలో నిర్మించిన డంపింగ్ యార్డులు ప్రస్తుతం పిచ్చి మొక్కలతో నిండి నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. శ్రీకాళహస్తి మండల పరిధిలో సుమారు రూ.8 లక్షల నుంచి రూ.10 లక్షలకు పైగా అంచనా వ్యయంతో తడి చెత్త, పొడి చెత్త శుద్ధి కేంద్రాలుగా నిర్మించిన బృందావనం(డంపింగ్ యార్డులు) శిథిలావస్థకు చేరి అసాంఘిక కార్యక్రమాలకు నిలయంగా మారుతున్నాయి. మండలంలోని 46 గ్రామ పంచాయతీల్లో ప్రతి పంచాయతీ పరిధిలో ఒకటి నుంచి రెండు డంపింగ్ యార్డులు ఉన్నాయి. ఈ యార్డుల్లో తడి, పొడి చెత్తలను వేరు చేసి సేంద్రియ ఎరువులను తయారు చేసి రైతులకు తక్కువ ధరకు అందించాలనే ఉద్దేశంతో వీటిని గత ప్రభుత్వం లక్షలు ఖర్చు పెట్టి నిర్మించింది. చెత్త సేకరణ కోసం కొంతమంది సిబ్బందిని ప్రత్యేకంగా నియమించారు. అయితే ప్రస్తుతం ఎక్కడా అవి వినియోగంలో లేవు. డంపింగ్ యార్డు భవనాల సముదాయం చుట్టూ పిచ్చి మొక్కలు, ముళ్ల పొదలు మొలిచి మందుబాబులు, అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారాయి. ఉన్నత లక్ష్యంతో ఏర్పాటు చేసిన వీటిని గాలికి వదిలేయడంతో రూ.కోట్ల ప్రజాధనం వృథా అవుతోంది. ప్రధానంగా గ్రామ స్థాయిలో పంచాయతీ కార్యదర్శుల నిర్లక్ష్యంతో వాటి పర్యవేక్షణ కరువై ప్రస్తుతం నిరుపయోగంగా దర్శనమిస్తున్నాయి. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి వాటిని వినియోగంలోకి తీసుకువచ్చి ప్రజలకు ఉపయోగపడే విధంగా చేయాలని పలు గ్రామాల ప్రజలు కోరుతున్నారు.



శ్రీకాళహస్తి మండలం జింగిలిపాలెం ఎస్సీ కాలనీలో నిరుపయోగంగా డంపింగ్ యార్డు

బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగితే చర్యలు



మందు బాబుల స్థావరాలను శుభ్రం చేయిస్తున్న ఎస్‌ఐ ఓబయ్య

నాగలాపురం: బహిరంగ ప్రదేశాలలో మద్యం తాగితే కేసులు నమోదు చేసి జైలుకి పంపిస్తామని ఎస్‌ఐ ఓబయ్య హెచ్చరించారు. ఆదివారం కారూరు మార్గంలో మందు బాబులు ఎక్కువగా మద్యం తాగే ప్రదేశాలను గుర్తించారు. అక్కడికి ఎస్‌ఐ ఓబయ్య పోలీసు సిబ్బందితో కలిసి వెళ్లారు. అక్కడ మద్యం తాగి పడేసిన బాటిళ్లను, వ్యర్థాలను పంచాయతీ పారిశుధ్య సిబ్బంది సాయంతో శుభ్రం చేయించారు. తాగుబోతులు బహిరంగ ప్రదేశాలలో మందు తాగి అల్లర్లు సృష్టిస్తున్నారని ఫోన్ ద్వారా ఫిర్యాదులు అందుతున్నాయని అన్నారు. మద్యం తాగుతూ పట్టుబడితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

పిచ్చాటూరులో గంగ జాతర చాటింపు



పిచ్చాటూరు గ్రామదేవత గంగమ్మ ఆలయం వద్ద పొంగళ్లు

పిచ్చాటూరు: మండల కేంద్రంలో ఆదివారం గంగ జాతర చాటింపు వేశారు. ఈ సందర్భంగా సాయంత్రం 6 గంటలకు మహిళలు గ్రామ దేవత గంగమ్మ ఆలయానికి చేరుకొని పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యం సమర్పించారు. ఆలయ పూజారి సాంప్రదాయబద్ధంగా ప్రత్యేక అభిషేక పూజలు చేశారు. అర్ధరాత్రి చాటింపు వేశారు. గ్రామ సర్పంచ్ కేజీ రోస్ రెడ్డి మాట్లాడుతూ జాతరలో భాగంగా సోమ, మంగళ, బుధ వారాల్లో గెరిగ ఉత్సవం, బుధవారం సాయంత్రం అమ్మవారి గ్రామోత్సవం, గురువారం సాయంత్రం నిమజ్జనంతో జాతర పరిసమాప్తమవుతుందని వివరించారు. ఏర్పాట్లను సర్పంచ్, గ్రామ పెద్దలు పర్యవేక్షించారు.

కార్యవర్గం ఎన్నిక



వాసుదేవులు



తిరుమలయ్య



అంకయ్య

ఏర్పేడు: అంబేడ్కర్ యువజన సంఘం మండల నూతన అధ్యక్షుడిగా పిల్లపాలెం వాసుదేవులు నియమితులయ్యారు. ఆదివారం ఏర్పేడు అంబేడ్కర్ భవనంలో సమావేశం జరిగింది. అలాగే అంబేడ్కర్ యువజన సంఘం మండల ఉపాధ్యక్షుడిగా మెరుం శంకరయ్య, ప్రధాన కార్యదర్శిగా మెరుం చంద్రశేఖర్, కోశాధికారిగా నారాయణ, అంబేడ్కర్ భవన నిర్మాణ కమిటీ చైర్మన్‌గా కావేరి తిరుమలయ్య, సభ్యులుగా కిరణ్‌కుమార్, జయరాం, గురవమ్మ, శంకరయ్య, గాలి రవి, ఈశ్వర్, అంబేడ్కర్ అడ్వైజరీ కమిటీ చైర్మన్‌గా మెరుం అంకయ్య ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ దళితుల సమస్యల పరిష్కారానికి కృషిచేస్తామని హామీ ఇచ్చారు.



• భారీ వర్షం..

శ్రీకాళహస్తి పట్టణంలో ఆదివారం సాయంత్రం నుంచి రాత్రి వరకు భారీ వర్షం కురిసింది. దీంతో వీధులు, రోడ్లన్నీ జలమయమయ్యాయి. డ్రైనేజీ కాలువలు పొంగి పొర్లాయి. ఎడతెరిపి లేకుండా వర్షం కురువడంతో పట్టణవాసులు తీవ్ర ఇబ్బంది పడ్డారు. – శ్రీకాళహస్తి



అద్వితీయం... నాట్య నీరాజనం



జానపద నృత్య ప్రదర్శన

తిరుపతి కల్చరల్: మహతి కళాక్షేత్రంలో నిర్వహించిన అయోధ్య రామునికి నాట్య కళా నీరాజనం కార్యక్రమం ఆదివారంతో ఘనంగా ముగిసింది. ప్రైడ్ ఇండియా కల్చరల్స్, సిటిజెన్స్ వెల్ఫేర్ ఫోరం సంయుక్త ఆధ్వర్యంలో రెండు రోజులపాటు ఈ కార్యక్రమం సాగింది. అత్యుత్తమ ప్రతిభ చాటిన నాట్య గురువులు, కళాకారులకు ప్రైడ్ ఇండియా కల్చరల్స్ సీఈఓ కోలా వెంకటేశ్వరరావు అయోధ్యరామ అవార్డ్ ఆఫ్ ఎక్సలెన్స్ అవార్డులు, ఇండియన్ ప్రైడ్ సెలబ్రిటీ వంటి ప్రతిష్టాత్మక పురస్కారాలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత, ప్రముఖ నాట్యాచార్యుడు వేదాంత రాధేశ్యామ్, నాట్య గురువు దేవేంద్రపిళ్లై, పసుమర్తి శేషుబాబు, డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, ఎంజీ.బాలాజీ, ప్రసాద్, కృష్ణయ్య, కోలా సంగీత రావు, కళాకారులు పాల్గొన్నారు.

ఇసుక డంప్ వద్ద రెవెన్యూ నిఘా



ఇసుక డంపు వద్ద వీఆర్‌ఓలు, పోలీసులు

నాగలాపురం: మండలంలోని సుబ్బానాయుడు కండ్రిగ వద్ద ఉన్న ఇసుక స్టాక్ పాయింట్ వద్ద ఇద్దరు వీఆర్‌ఓలను నియమించినట్టు తహశీల్దార్ డి.నరసింహులు తెలిపారు. ప్రభుత్వం అనుమతులు జారీ చేసేంత వరకు ఇసుక తరలించకూడదని తహశీల్దారు ఆదేశాలు జారీచేశారు. అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తే మాత్రం వాహనాలను సీజ్ చేస్తామని ఆయన పేర్కొన్నారు. ఇందు కోసం స్టాక్ పాయింట్ వద్ద పోలీసులు, రెవెన్యూ సిబ్బందిని నిఘా పెట్టామని తెలిపారు.

శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళి



శ్యాంప్రసాద్ ముఖర్జీకి నివాళులు అర్పిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పాతబస్టాండు వద్ద జనసంఘ్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్యాంప్రసాద్ ముఖర్జీకి స్థానిక బీజేపీ నాయకులు నివాళులు అర్పించారు. బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కోలా ఆనంద్ నేతృత్వంలో ఆదివారం పట్టణాధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు ఆధ్వర్యంలో డాక్టర్ శ్యామా ప్రసాద్ ముఖర్జీ చిత్రపటం ఏర్పాటు చేసి నివాళులు అర్పించి, ఆయన సేవలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఉమ, సుబ్రహ్మణ్యంరెడ్డి, అమర్‌నాథ్, రమణ, రమణారెడ్డి, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన సప్తగిరి సంగీత సప్తాహం

తిరుపతి కల్చరల్: అన్నమాచార్య ప్రాజెక్టు కళాకారుల సహకారంతో మనోవికాస్ నిర్వాహకుడు, మృదంగ విద్వాంసుడు పున్నమరాజు మురళీకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సప్తగిరి సంగీత సప్తాహం ఆదివారంతో ఘనంగా ముగిసింది. యశోదనగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రం ఆడిటోరియంలో వారం రోజులపాటు నిర్విరామంగా సాగిన ఈ కార్యక్రమ ముగింపు వేడుక ఘనంగా నిర్వహించారు. అంతర్జాతీయ స్థాయిలో చేపట్టిన ఈ సప్తగిరి సంగీత సప్తాహం కార్యక్రమం ఏడు రాత్రులు, ఏడు పగళ్లు 168 గంటలపాటు నిర్విరామంగా సాగింది.

ఘనంగా సిద్ధేశ్వర స్వామి జాతర



పొంగళ్లు పెడుతున్న మహిళలు

బుచ్చినాయుడుకండ్రిగ: గ్రామంలోని సిద్ధేశ్వర స్వామికి ఆదివారం గ్రామస్తులు ప్రత్యేక పూజలు చేసి, పొంగళ్లు పెట్టి జాతరను ఘనంగా నిర్వహించారు. గ్రామంలో జాతర వాతావరణం నెలకొంది. సిద్ధేశ్వరస్వామి విగ్రహానికి అభిషేకాలు చేసి, పూలతో అలంకరించారు. అనంతరం అంబళ్లు పోసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు. భక్తులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.



సిద్ధేశ్వర స్వామికి పూజలు చేస్తున్న మహిళలు

నాసిరకంగా రోడ్డు పనులు



రోడ్డుపై గుంతలకు మరమ్మతులు చేస్తున్న దృశ్యం

బుచ్చినాయుడుకండ్రిగ: శ్రీకాళహస్తి–తడ రోడ్డుపై గత నవంబరు నెలలో కురిసిన భారీ వర్షాల కారణంగా పలుచోట్ల గుంతలు ఏర్పడ్డాయి. రోడ్డుపై ఉన్న గుంతలకు గత నాలుగు రోజులుగా ఆర్అండ్‌బీ అధికారులు కాంట్రాక్టరుతో ప్యాచ్‌లు వేసి మరమ్మతులు పనులను చేయిస్తున్నారు. అయితే రోడ్డుపై ఉన్న కొన్ని గుంతలకే ప్యాచ్‌లు వేసి మరమ్మతులు చేయడంపై వాహనదారులు ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు. రోడ్డుకు ఉన్న గుంతల అన్నింటికి మరమ్మతులు చేయకుండా కొన్నింటికి మాత్రమే ప్యాచ్‌లు వేయడం ఏమిటంటున్నారు. ఇప్పటికై నా ఆర్అండ్‌బీ అధికారులు స్పందించి నాణ్యతతో మరమ్మతులు చేయాలని వాహనదారులు కోరుతున్నారు.



పదో మైలు వద్ద మరమ్మతులకు నోచుకోని గుంత

గౌడ సంక్షేమ సంఘ ఎన్నిక

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గ గౌడ సంక్షేమ సంఘం నూతన కార్యవర్గాన్ని జిల్లా నాయకులు పురుషోత్తంగౌడ్, ఉదయగిరి మోహన్‌గౌడ్, ముద్ద రాధాకృష్ణ, చిట్టిం శంకరయ్య ఆధ్వర్యంలో ఆదివారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా తిరకాల ఆనంద్‌గౌడ్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యదర్శిగా వెంకటరమణ గౌడ్, కార్యనిర్వాహకులుగా గణేష్ గౌడ్ తదితరులను ఎన్నుకున్నారు. అనంతరం కల్లుగీత కార్మికులకు గుర్తింపుకార్డులు అందజేశారు. కార్యక్రమంలో అత్తిరాల శ్రీరాములు గౌడ్, బత్తయ్యగౌడ్, పాపయ్యగౌడ్, మునిశేఖర్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన గౌడ సంఘం నాయకులు

ముగ్ధ మనోహరం

తిరుమల కొండల్లో ప్రకృతి సోయగం అత్యంత సహజం. జలపాతాలు.. ఎత్తైన కొండలు.. పచ్చదనంతో నిండి ఉంటుంది శేషాచలం అటవీ ప్రాంతం. ప్రస్తుతం తిరుమల ఘాట్‌రోడ్లకు ఇరువైపులా పూల అందాలు ఆకట్టుకుంటున్నాయి. ముగ్ధ మనోహరంగా కనువిందు చేస్తున్నాయి. శ్రీవారి దర్శనార్థం వచ్చే భక్తులు సైతం అందాల పూల చెట్ల వద్ద నిలుచుని సెల్ఫీలు దిగుతున్నారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, తిరుపతి



తిరుమల నుంచి తిరుపతికి వచ్చే మొదటి ఘాట్‌రోడ్డులో పుష్పసోయగం



తిరుపతి నుంచి తిరుమలకు వెళ్లే రెండో ఘాట్‌రోడ్డులో ఆకర్షిస్తున్న పూలు